శృంగార కథ

# "అర్థాలే వేరులే..."

పెన్మెత్స శ్రీకాంత్ రాజు



"సరూ! ఓసారిట్రా!" పిలిచేడు సుబ్బారావు పడగ్గదిలోంచి.

సమాధానంగా వంటింట్లోంచి గిన్నెల చప్పుడు.

"మొండి దెయ్యం!" కసిగా అనుకున్నాడు. అంతోనే సరోజ వంపుసొంపులు గుర్తొచ్చి వంటింటివైపు నడిచాడు.

అటువైపు తిరిగి సింకులో గిన్నెలు కడుగుతోంది సరోజ. సుబ్బారావు రాకని గమనించినా గమనించనట్టే తన పని తను చేసుకోసాగింది.

ఆమె నడుం మీద చేతులేసి తల్లోని మల్లెల్ని వాసన చూడబోయాడు సుబ్బారావు. చివాల్న విదిలించుకుంది సరోజ, పురుగుని విదిల్చినట్టుగా.

"ఏం, గొప్ప చేస్తున్నావు?" రోషంగా అడిగాడు సుబ్బారావు.

"ఇలాంటివాటికేం? అసలు దాంట్లో వుండాలి సత్తా!" లాగిపెట్టి దవడమీద కొట్టినట్టు అదిరిపోయాడు సుబ్బారావు.

సుబ్బారావుకి తన సామర్థ్యం మీద విపరీతమైన నమ్మకం! సరోజ అలా అనేసరికి ఖంగు తిన్నాడు. ఏం సమాధానం చెప్పాలో అర్థంకాక విసురుగా పడగ్గదిలోకి వెళ్లి మంచంమీద వాలాడు.

చాలా రోజుల్నుంచి సరోజ శృంగారం మీద ఆసక్తి చూపించటం లేదు. తన మీద చీటికిమాటికి చిరాకుపడుతోంది. ఎప్పుడూ మూతి ముడుచుకుని వుంటోంది! ఇంట్లో పని ఒత్తిడి వల్లనో, బాధ్యతల వల్లనో అనుకునేవాడు తను. కాని అది నిజం కాదు. తను ఆమెని సంతృప్తి పరచలేక పోతున్నాడన్నమాట-అనుకున్నాడు సుబ్బారావు.

అంతలోనే అతనికి గుర్తొచ్చింది. ఆ అట్టపెట్టెల గురించి. జనరల్ స్టోర్సులోను,

మెడికల్ స్టోర్సులోను కనిపించే అట్టపెట్టెలు... వాటిమీద జోడు గుర్రాలు దౌడు తీస్తుంటాయి. ఓ వైపు నుంచి పొగ వస్తూ వుంటుంది. మరోవైపు రతి భంగిమలో ఆడా, మగా!

తన సమస్యకు పరిష్కారం దొరికినందుకు నిశ్చింతగా నిద్రపోయాడు సుబ్బారావు.

మర్నాడు...

ఆ మాత్రలు మింగి అట్టమీద గుర్రాల వంక చూసి సరోజని దగ్గరికి లాక్కుని



చెలరేగిపోయాడు సుబ్బారావు.

కాసేపటి తర్వాత చెమట తుడుచుకుంటూ అడిగాడు సుబ్బారావు- "ఎలా వుంది?" అని.

"ఉక్క పెడుతోంది. ఓ కూలరున్నా బావుండేది. దేనికైనా పెట్టిపుట్టాలి. మీసమున్నంత మాత్రాన మొగోడైపోడు. 'ఆ' చాకచక్యం తెలియాలి. మీకంటే వర్ధనమ్మ మొగుడే బెటర్!"

సరోజ నోటినుంచి వెలువడ్డ ఆ మాటలు సుబ్బారావు గుండెల్ని తూటాల్లా తాకాయి! రోషం పొడుచుకొచ్చింది. సరోజని పీకనొక్కి చంపేయాలనిపించింది సుబ్బారావుకి.

"ఉఫ్ అని ఊదితే ఊరవతల పడేలా వుండే ఆ పీచుగడ్డం, పీతకళ్ల రామారావు నాకంటే బెటరా? అయినా వాడి సమర్థత నీకెలా తెలుసు?" ఎకసెక్కంగా అన్నాడు సుబ్బారావు.

"మగాడి సమర్థత ఆడదాన్ని చూస్తే తెలుస్తుంది. అయినా సమర్థతకి, పర్సనాలిటీకి సంబంధం ఏముంది? నన్ను ఇంక విసిగించకండి!" సరోజ అటు తిరిగి పడుకుంది.

"యా...!" జుట్టు పీక్కున్నాడు సుబ్బారావు.

✣ ✣ ✣

"సుబ్బారావూ! నువ్వు శారీరకంగా పూర్తి ఆరోగ్యంగా వున్నావు. శృంగారంలో నీకే విధమైన అసంతృప్తీ లేదంటున్నావు. కాబట్టి నువ్వూ, నీ భార్యా కలిసి ఓ సారి రండి. మా ఆవిడ కూడా డాక్టరే కనుక నువ్వు నీ భార్యని నిరభ్యంతరంగా తీసుకురావచ్చు మీ ఆవిడని కూడా ఎగ్జామిన్ చేసేక ప్రోబ్లమ్ ఎక్కడుందనేది తెలుసుకుని తగిన చర్యలు తీసుకోవచ్చు" చెప్పేడు డాక్టర్.

సుబ్బారావు అంగీకారసూచకంగా తలూపేడు.

✣ ✣ ✣

"సరూ! ఈ రోజు ఆస్పత్రికెళ్దాం, తయారవ్వు" అడిగాడు సుబ్బారావు.

"మీరు తాటికొట్టెలా, నేను దిబ్బరొట్టెలా సుబ్బరంగా వున్నాం. ఆస్పత్రికెందుకటా?" దీర్ఘం తీసింది సరోజ.

"వస్తావా? రావా?" గట్టిగా అన్నాడు సుబ్బారావు.

నిమిషంలో తయారయింది సరోజ. ఇద్దరూ హాస్పిటల్‌కు వెళ్లారు.

"నాతో రామ్మా!" సరోజని తనతో తీసుకెళ్లింది లేడీడాక్టర్.

పదిహేను నిమిషాల తర్వాత సరోజ విసురుగా డాక్టర్ రూంలోంచి వచ్చింది. అక్కడే కూచున్న సుబ్బారావు వైపు చూడనైనా చూడకుండా వేగంగా పరిగెడుతూ రోడ్డు మీదకు వచ్చింది.

"ఆగు సరోజా!" సుబ్బారావు కేకల్ని లెక్క చేయకుండా ఓ ఆటోని పిల్చి ఎక్కి కూర్చుని "పోనీయ్!" అంది.

✣ ✣ ✣

తలుపు తోశాడు సుబ్బారావు. ఓరగా వేసివున్న తలుపు తెరుచుకుంది.

విసురుగా వచ్చి సుబ్బారావు షర్టు పట్టుకుంది సరోజ. "ఏమనుకుంటున్నారు నా గురించి? మొగుడుచాలని ఆడదానిలా కనిపిస్తున్నానా? మీ వల్ల నాకు సుఖం లేదని ఎలా అనుకున్నారు? నేనెప్పుడైనా అన్నానా?" తన మోము అశ్రుధారలతో నిండిపోగా ఉద్రేకంతో ఊగిపోతూ అడిగింది సరోజ.

"అబ్బా! చండిక రూపం చాలించు! ఆ పీచుముఖం రామారావు నాకంటే బెటర్ అని, మొగుడి సమర్థత పెళ్లాన్ని చూస్తే తెలుస్తుందని, మీసమున్నంత మాత్రాన మొగోడైపోడని రకరకాలుగా నువ్వు కామెంట్స్ చెయ్యలేదా?"

సరోజ సుబ్బారావు చొక్కా వదిలేసింది. "మీ తెలివి తెల్లారినట్టే వుంది! సమర్థత అంటే 'సంపాదించటం' అనే ఉద్దేశంతో అన్నానలా. వర్ధనమ్మకి బోలెడన్ని నగలు చేయించాడు ఆ పీచుముఖం. ఇల్లుకూడా కొంటున్నాడు. మిమ్మల్ని దెప్పితే మీరు కూడా పౌరుషం తెచ్చుకుని పై సంపాదన చేస్తారని అలా అన్నాను" చెప్పింది సరోజ.

సుబ్బారావు మనసు దూదితునకలా తేలికైపోయింది! "ఈ రోజు పేపర్ చూడలేదా? రామారావు లంచం పుచ్చుకున్న నేరానికి అరెస్ట్ అయ్యాడు. అయినా పై సంపాదన లేకుండా హాయిగా వుండాలి!"

సుబ్బారావు దగ్గరికొచ్చి బుగ్గమీద ముద్దిచ్చి అంది సరోజ-"ఉండగలం!"

"ఎలా?" కొంటెగా అన్నాడు సుబ్బారావు.

సరోజ సమాధానం చెప్పింది.

కాని మాటలతో కాదు! ■